## మహిళా శ్రేయస్సే 'శుక్రవారం సభ' లక్ష్యం: కలెక్టర్

కలెక్టరేట్, జూన్ 13 : మహిళా శ్రేయస్సే శుక్రవారం సభ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని దుర్గమ్మగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శుక్రవారం సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తారన్నారు. నూతన సిలబస్‌తో ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లతో అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధిస్తున్నట్లు వెల్లడించారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీలకు పంపించాలని సూచించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు ప్రతినెలా నమోదు చేసి శుక్రవారం సభలో ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు కోడిగుడ్డు, బిర్యానీతో మధ్యాహ్న భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, సీడీపీవో కె.సబితకుమారితో పాటు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 'బడిబాట' పాట ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి 'విద్యావాహిని-బడిబాట పాట' పేరుతో రూపొందించిన పాటను కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ పాటను కాందూరి వెంకటేశ్వర్లు రచించగా, కేబీ శర్మ సంగీతం సమకూర్చారు. కార్యక్రమంలో గంగాధర మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, తెలుగు ఉపాధ్యాయుడు నంది శ్రీనివాస్ ఉన్నారు.

## కలెక్టర్ వాట్సాప్ స్టేటస్‌గా వెంకటాయపల్లి పాఠశాల ఫొటో



కలెక్టర్ వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్న వెంకటాయపల్లి పాఠశాల విద్యార్థుల ఫొటో

గంగాధర, జూన్ 13: విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా మండలంలోని వెంకటాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించగా, ఇందుకు సంబంధించిన ఫొటోను కలెక్టర్ పమేలా సత్పతి తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాలను కలెక్టర్ వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడంపై మండల ప్రజల నుంచి అభినందలను వెల్లువెత్తుతున్నాయి.

## కరీంనగర్ క్లబ్‌లో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

విద్యానగర్, జూన్ 13: కరీంనగర్ క్లబ్‌లో సభ్యుల ఆరోగ్య పరీక్షల కోసం వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం కలెక్టర్, క్లబ్ చైర్ పర్సన్ పమేలా సత్పతి ప్రారంభించారు. పలువురు సభ్యులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరీంనగర్ క్లబ్ సభ్యులు వెల్‌నెస్ సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. క్లబ్‌లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్ క్లబ్ కార్యదర్శి గంప వెంకట్, సంయుక్త కార్యదర్శి మనోహర్ రావు, కోశాధికారి రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.

# దొంగల ముఠా గుట్టురట్టు

- ఐదుగురిపై కేసు.. ఇద్దరి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో తాళంవేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగల ముఠా గుట్టును పోలీసులు రట్టుచేశారు. శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దొంగల ముఠాకు సంబంధించిన వివరాలను సీపీ గౌస్‌ఆలం వెల్లడించారు. ఈ నెల 8న వెంకటయ్యపల్లికి చెందిన ఉప్పుగండ్ల గంగారెడ్డి మధ్యాహ్నం 3.30 గంటలకు తన ఇంటికి తాళం వేసి మంచి నీళ్ల కోసమని గ్రామంలోకి వెళ్లగా, అదే సమయంలో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రెండు బీరువాల్లోంచి 33తులాల బంగారం, 25తులాల వెండి, రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. గంగారెడ్డి సాయంత్రం 5.15గంటలకు వచ్చిచూడగా బీరువాలు పగులగొట్టి విలువైన నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసు దర్యాప్తు బృందం నిందితులను చాకచక్యంగా పట్టుకున్నది. జాల్సాల కోసం మానకొండూర్‌కు చెందిన ఓ వ్యక్తికి తక్కువ ధరకే కొంత బంగారాన్ని అమ్ముకున్నామని, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌లో కొంత బంగారాన్ని కుదువపెట్టి రూ.64వేలు తీసుకున్నట్లు నిందితులు అంగీకరించినట్లు సీపీ వెల్లడించారు. కొన్ని వెండి ఆభరణాలను అరవింద్, ప్రశాంత్ పంచుకున్నారని, వీటితోపాటు దొంగతనంలో పాల్గొన్న హేమంత్, నవీన్‌తోపాటు మరొకరిపై కేసు నమోదు చేశామని సీపీ తెలిపారు. హేమంత్, నవీన్‌ను అరెస్ట్ చేయగా, మిగతా ముగ్గురిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన వెల్లడించారు. కేసును అనతికాలంలోనే ఛేదించిన కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, చొప్పదండి సీఐ ప్రదీప్, క్రైమ్ టీం సీఐ రాజు, గంగాధర ఎస్ఐ వంశీకృష్ణ, సీసీఎస్ ఎస్ఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుళ్లు రవిందర్, అనిల్, సాయి, ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ ప్రదీప్‌ను సీపీ అభినందించారు.

## ఐట్రిపుల్ ఈ స్మార్ట్ వరల్డ్ కాంగ్రెస్‌కు జ్యోతిష్మతి విద్యార్థినుల పరిశోధన పత్రం

తిమ్మాపూర్ రూరల్, జూన్ 13: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాల ఈసీఈ విభాగం నాలుగో సంవత్సరం విద్యార్థినులు శర్వాణి గజ్జల, శ్రీలేఖ కుసన, సమ్మత బెల్లం, శ్రీజ చింతకింది రాసిన 'పైథాన్ ప్రోగ్రామింగ్ ఫర్ ఎఫిషియంట్ బ్రీడమిక్స్ ఇమేజ్ ప్రాసెసింగ్ అండ్ అనాలసిస్' పరిశోధన వ్యాసం ఐట్రిపుల్ఈ స్మార్ట్ వరల్డ్ కాంగ్రెస్ 2025లో ప్రదర్శన కోసం ఎంపికైంది. అలాగే కార్యకలాపాల్లో ప్రచురణ కోసం రెగ్యులర్ పేపర్‌గా ఆమోదం పొందింది. ఈ మేరకు కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు శుక్రవారం వెల్లడించారు. కెనడాలోని అల్బర్టాలో ఆగస్టులో తమ విద్యార్థినులు పరిశోధన పత్రాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ప్రచురించబోయే ఈ పరిశోధన పత్రానికి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇండియా ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సుమిత్ సాయి, అకాడమిక్ డీన్ వైశాలి, అధ్యాపకులు విద్యార్థి బృందానికి అభినందనలు తెలిపారు.

## 17, 18న మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

కొత్తపల్లి, జూన్ 13 : రాష్ట్రంలోని మూడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం ఈనెల 17, 18వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి వి. శ్రీనివాస్‌గౌడ్ జిల్లా, మండల స్థాయి ఎస్‌ఎఫ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 25, 26 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ముందుగా tgss.telangana.gov.in లాగిన్ అయి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మండల స్థాయిలో జరిగే పోటీలు, ఇతర వివరాలకు రమేశ్ 9948749943(దుర్శేడు), శంకరయ్య 9849114956 (సప్తగిరి కాలనీ) నరసయ్య 9849463584 (మానకొండూర్), బన్నీలాల్ 9652637678(తిమ్మాపూర్), రమ 9494724946(గన్నేరువరం), శ్రీనివాస్ 9848738704 (శంకరపట్నం), కృష్ణ 8328476506(చొప్పదండి), దత్తాత్రి 9849976087(రామడుగు), శ్రీనివాస్ 9441700892(గంగాధర), లక్ష్మణ్ 8099546565(కొత్తపల్లి), సమ్మయ్య 9441558298(చిగురుమామిడి), శ్రీనివాస్ 8333972665 (హుజూరాబాద్), ప్రతిమ 9618646329 (సైదాపూర్), సత్యనారాయణ 9440458494(ఇల్లందకుంట), శ్రీలత 9705617027(జమ్మికుంట), శ్రీనివాస్ 9346120205(వీణవంక)ను సంప్రదించాలని తెలిపారు.

## పొన్నం రవిచంద్రకు 'బెస్ట్ ఫిలిం క్రిటిక్ గద్దర్' అవార్డు



పొన్నం రవిచంద్ర

కమాన్‌చౌరస్తా, జూన్ 13: తెలుగు సినిమా విమర్శలో తనదైన ముద్ర వేసి, సినీ రంగంపైన అనేక వ్యాసాలు, పుస్తకాలు రాసిన పొన్నం రవిచంద్రకు 2024 సంవత్సరానికి 'బెస్ట్ ఫిలిం క్రిటిక్'గా గద్దర్ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 14న హైదరాబాద్‌లో హైటెక్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును ఆయన అందుకోనున్నారు. 'పైడి జైరాజ్'పై రూపొందించిన డాక్యుమెంటరీకి గానూ ఈ అవార్డుకు పొన్నం రవిచంద్ర ఎంపికకాగా, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీతో పాటు, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, కఫిసొ బాధ్యులు లక్ష్మిగౌతమ్, మాడిశెట్టి గోపాల్, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, కోల రామచంద్రారెడ్డి, వరాల మహేశ్, సాహితీ సాంస్కృతిక సంస్థల బాధ్యులు అభినందనలు తెలిపారు.

## నగర పాలక సంస్థ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కార్పొరేషన్, జూన్ 13: నగర పాలక సంస్థ కమిషనర్‌గా ప్రఫుల్ దేశాయ్ శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామన్నారు. డివిజన్ల పునర్విభజనకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలన్నింటిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామన్నారు. ఏ కమ్యూనిటికీ అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


## డివిజన్ల పునర్విభజనలో లోటుపాట్లు సరి చేయాలి

కార్పొరేషన్, జూన్ 13: నగరపాలక సంస్థలో ఇటీవల అధికారులు ప్రకటించిన డివిజన్ల పునర్విభజనలోని లోపాలను సరిదిద్దాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ శుక్రవారం కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి విన్నవించారు. పలు డివిజన్ల పునర్విభజన ఇష్టారాజ్యంగా చేపట్టారని ఆరోపించారు. బీజేపీ నాయకుల కనుసన్నల్లో పునర్విభజన చేసినట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని డివిజన్ల విభజన తీరును మరోసారి సమీక్ష చేయాలని కోరారు.

## సీపీవో రాజారాం బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్, జూన్ 13 : జిల్లా ముఖ్యప్రణాళికాధికారిగా రేగుంట రాజారాం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా సీపీవో కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన జాయింట్ డైరెక్టర్‌గా ప్రమోషన్‌పై జిల్లాకు బదిలీ అయ్యారు. రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు వెలువడగా, శుక్రవారం ఉదయం జేడీ కేడర్‌లో సీపీవోగా విధుల్లో చేరారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

## బ్లూ బెల్స్ విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ జంగ సునీతా మనోహర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూన్ 13 : జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ హైస్కూల్ విద్యార్థిని రీ వెరిఫికేషన్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపగా, పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీతా మనోహర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కరస్పాండెంట్ మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థిని పుప్పాల నిశ్విక గణితంలో మొదటగా ప్రకటించిన 94 మార్కులకు బదులుగా, రీ వెరిఫికేషన్‌లో పూర్తి 100 మార్కులు సాధించడంతో ఆమె మొత్తం మార్కులు 578కి చేరాయని వెల్లడించారు. ఈ మేరకు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. బ్లూ బెల్స్ పాఠశాల విద్యార్థులు ప్రతి ఒక్కరూ అభ్యాసంలో నిబద్ధత, గురువుల మార్గదర్శనంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉన్నారు.

## 15న సమైక్య సాహితీ పురస్కారాల ప్రదానం

కమాన్‌చౌరస్తా, జూన్ 13 : సమైక్య సాహితీ తరపున తండ్రుల పేరుతో విశిష్ట పురస్కారాల ప్రదాన కార్యక్రమం నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రదానం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, కేఎస్ అనంతాచార్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో జీవీ శ్యాంప్రసాద్ లాల్ ప్రదాతగా ఆచార్య రజనీశ్రీ నృత్య పురస్కారం డాక్టర్ పేరిణి కుమార్‌కు, కేఎస్ అనంతాచార్య ప్రదాతగా కలకుంట్ల సంపత్ కుమారాచార్య సంగీత పురస్కారం లక్ష్మి శేషాచార్యులకు, రావికంటి శ్రీనివాస్ ప్రదాతగా రావికంటి రామయ్య గుప్త సాహితీ పురస్కారం డాక్టర్ రంగాచార్యకు, మాడిశెట్టి గోపాల్ ప్రదాతగా మాడిశెట్టి మల్లయ్య ఉపాధ్యాయ పురస్కారం బెజ్జారపు వినోద్ కుమార్‌కు, డాక్టర్ రఘురామన్ ప్రదాతగా డాక్టర్ దారం నాగభూషణం పురస్కారం ఆచార్య అడపా సత్యనారాయణకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా శ్యాంప్రసాద్‌లాల్, పొన్నం రవిచంద్ర, గోవర్ధనగిరి అనంతాచార్యులు హాజరవుతారని తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

## ర్యాలపల్లి పల్లె దవాఖానను సందర్శించిన సెంట్రల్ టీం

గంగాధర, జూన్ 13: మండలంలోని ర్యాలపల్లి పల్లె దవాఖానను జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలో రోగులకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో సౌకర్యాలు, రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఇక్కడ సెంట్రల్ టీం సభ్యులు అఖిల్, సాగర్, మెడికల్ ఆఫీసర్ శ్వేత, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, సిబ్బంది నయీమ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

కొత్తపల్లి, జూన్ 13: నిజామాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాయ్స్, గర్ల్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి పతకాలు సాధించారు. జిల్లా క్రీడాకారులు స్మితరెడ్డి 75 కేజీలో విభాగంలో గోల్డ్ మెడల్, సుకుమార్ 66 కేజీల విభాగంలో సిల్వర్, జి సాకేత్ బ్రాంజ్ మెడల్స్ సాధించి సత్తాచాటారు. వీరిని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ బాక్సింగ్ వైస్ ప్రెసిడెంట్ మడిపల్లి కాళీచరణ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారుడి ప్రతిభ

కొత్తపల్లి, జూన్ 13 : యూరోపియన్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని జీనియస్ అకాడమీకి చెందిన క్రీడాకారుడు కడారి గోపాల్‌రావు ఎంపికైనట్లు డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌కు చెందిన సౌమ్య- సంతోష్‌కుమార్ దంపతుల కుమారుడైన గోపాల్‌రావు జర్మనీ దేశంలో ఉంటున్నాడు. కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీలో ఆన్‌లైన్ వేదికగా చెస్‌లో శిక్షణ పొందాడు. ఈ నెల 11, 12న ఆ దేశంలో జరిగిన ఆస్ట్రియస్ చెస్ చాంపియన్‌షిప్ అండర్-8 పోటీల్లో అద్వితీయ ప్రతిభ చూపి, కాంస్య పతకం సాధించి యూరోపియన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడని అనూప్ కుమార్ వెల్లడించారు. విద్యార్థిని అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య, కోచ్‌లు సృజన్‌కుమార్, అభిరాం, అనూష్, వరుణ్, అరుణ్, రేవిక్ వర్ధన్, నితిన్, తరుణ్, స్వాతి, శ్రీనిజ, ప్రభుచంద్ర అభినందించారు.

## స్కూల్ బస్సులపై కొనసాగుతున్న డ్రైవ్

తిమ్మాపూర్, జూన్ 13: స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తున్నారు. శుక్రవారం సైతం జిల్లావ్యాప్తంగా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫిట్‌నెస్ ఇతర పత్రాలు లేని రెండు స్కూల్ బస్సులను సీజ్ చేసి తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయానికి తరలించారు. తనిఖీల్లో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

గంగాధర, జూన్ 13 : క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని నాయకుడు తూడి లచ్చయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మధురానగర్‌లో క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.10 వేలు, 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. పోటీల స్పాన్సర్లు పిట్టల ప్రశాంత్, గొంటి విక్రమ్, మిలుకుల నరేశ్, మార్క ప్రమోద్, రాసూరి సంజీవ్, మడ్లపెల్లి గంగాధర్, పడాల రాజన్నను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పుట్కం రవీంద్రనాథ్ ఠాగూర్, కట్ల శ్రీనివాస్, గంట విజయ్, నరేశ్, వివేక్, ఉపేందర్, ప్రణయ్, ప్రదీప్, సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTER OF CHITS / ARBITRATOR AT KARIMNAGAR
ARB. NO. 112/2023
Between:-
SOMASHEKARA CHIT FUNDS PRIVATE LIMITED., Represented by its Branch Foreman, Jammikunta Branch ...Disputant
AND
Kankanala Srinivas reddy and Others ...Opponents
Opp.No(02) Vontela Rahul Kumar, S/o. Komuraiah, Age: 52 Years, R/o. H.No. 2-6-9/1, Krupa Nilayam, Circuit House Road, nakkalagutta, District Hanamkonda, 506001
Opp.No(03) Jannu Sravan Kumar, S/o. Manikyam, Age: 46 Years, R/o. H.No. 1-2-302, Rehmath Nagar, Near St Johns High School, Kazipet District: Warangal Urban, 506003
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you. But you have failed to receive the same. The above dispute is posted on 30-06-2025 for your appearance. On that day you have to appear in person at 11:00 a.m. before the deputy registrar referred above. other-wise case will be decided ex-parte.
Sd/- CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS KARIMNAGAR.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Female Accountants, Qul: B.Com(Accounts), Exp: 2 Yrs in Tally Software, Job Location Karimnagar, Salary: 12K-15K per Month, Negotiable, Interested candidates can send resume: 8977919477 (Whatsup), email: anilcholleti.ca@gmail.com.
NTK-350007
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

తిమ్మాపూర్, జూన్ 13: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య కోరారు. మండలంలోని రామకృష్ణకాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించేలా గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు కృషి చేయాలని డీఈవో కోరారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ రూరల్, జూన్ 13: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని భవిత కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి శ్రీరాముల మొండయ్య శుక్రవారం సందర్శించారు. కేంద్రం పనితీరు,అమలవుతున్న కార్యక్రమాలు, దివ్యాంగుల పిల్లల సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను తనిఖీ చేసి, ఐఆర్పీల కృషిని అభినందించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూన్ 13: ఆదర్శ పాఠశాల రుక్మాపూర్‌లో 6నుంచి 10వ తరగతి వరకు (2025-2026)మిగిలిపోయిన సీట్లకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

### పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల నియామకానికి..

విద్యానగర్, జూన్ 13: భారతీయ తపాలా శాఖ కరీంనగర్ డివిజన్ పరిధిలో, కమిషన్ బేసిస్‌తో తపాలా జీవిత బీమా, (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ కె.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18-50 ఏళ్ల మధ్య ఉన్న కరీంనగర్ డివిజన్‌కు చెందిన పౌరులు అర్హులని, పూర్తి చేసిన దరఖాస్తులను కరీంనగర్ డివిజన్ ఆఫీస్‌లో ఈ నెల 27లోగా అందజేయాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ అనంతరం ఏజెంట్లుగా నియమితులైన వారు సెక్యూరిటీ డిపాజిట్ (ఎన్ఎస్‌పి లేదా కేవీపీ)గా రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్ సిబ్బందిని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## కరెంట్‌షాక్‌తో యువకుడి మృతి

తిమ్మాపూర్, జూన్ 13: మండల కేంద్రానికి చెందిన యువకుడు కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన న్యాలం హరీశ్(35) గ్రామంలో పనులు చేసుకుంటూ భార్య దివ్య, బిడ్డ శ్రీహిత, కొడుకు అక్షయ్‌తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వారి ఇంటి ముందు ఉన్న సంపు నుంచి నీళ్లు తీసుకుంటుండగా.. సంపులో ఉన్న మోటర్‌కు విద్యుత్ ప్రవహించి చేతికి షాక్ వచ్చి పడిపోయాడు. కుటుంబసభ్యులు చూసేసరికి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మరణించాడు. హరీశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హరీశ్ భార్య దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## నూతన కార్యవర్గం

తిమ్మాపూర్ రూరల్, జూన్ 13 : మండలంలోని అలుగునూర్ (8వ డివిజన్)లోని మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిందం మల్లేశం, ఉపాధ్యక్షుడిగా చిందం సంపత్, గౌరవాధ్యక్షుడిగా చిందం మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా చిందం మహేశ్, సహాయ కార్య దర్శిగా కోమటిరెడ్డి రమేశ్, కోశాధికారిగా సల్ల కిష్టయ్య, ముఖ్య సలహాదారులుగా చిందం లింగయ్య, పురంశెట్టి అనోహర్, ఈరుపాటి రాజయ్య, చిందం చంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా చిందం మల్లేశం, చిందం కరుణాకర్, సల్ల కనకయ్య, చిందం శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

## నిందితుల అరెస్ట్

కరీంనగర్ రూరల్, జూన్ 13: తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సామిండ్ల పద్మప్రియ 2008లో చనిపోగా, ఆమెకు బొమ్మకల్ శివారులో భూమి ఉన్నది. సదరు భూమిని కబ్జా చేయాలనే ఉద్దేశంతో పుట్టపాక శ్రీనివాస్, గడాల శ్రీనివాస్, దేవునూరి రమేశ్ మరికొందరితో కలిసి తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తర్వాత ఆ భూమిని ఇతరులకు విక్రయించారు. ఈ కేసులో ఏ-1 పుట్టపాక శ్రీనివాస్‌ను గతంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మిగతా ఇద్దరు తప్పించుకు తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఏ2 గడాల శ్రీనివాస్, ఏ3 దేవునూరి రమేశ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## కిట్స్‌లో వీడ్కోలు సమావేశం

హుజూరాబాద్ రూరల్, జూన్ 13: మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో ఈసీఈ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం ఉద్యోగం కోసం మాత్రమే ప్రయత్నించకుండా కొత్త పరిశ్రమలను స్థాపించి ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ బ్రాంచిల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## ఎస్ఐని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

గన్నేరువరం, జూన్ 13: గన్నేరువరం ఎస్ఐగా నరేందర్ రెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించగా, శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గూడెల్లి ఆంజనేయులు, న్యాత సుధాకర్, బద్దం తిరుపతి రెడ్డి, ప్రభాకర్, శంకర్, గూడూరి సురేశ్, గొల్లపల్లి రవి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు

కార్పొరేషన్/చొప్పదండి, జూన్ 13: వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కళాభారతిలో పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వారికి సాధారణ వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అలాగే చొప్పదండి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మున్సిపల్ కమిషనర్ కె. నాగరాజు, వైద్యాధికారి కె. కీర్తన ఆధ్వర్యంలో పట్టణ మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

గంగాధర, జూన్ 13: ఉప్పరమల్యాల గ్రామంలో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్, గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 200 మందికి షుగర్, బీపీ, 2డీ ఎకో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్ సురేశ్, మేనేజర్ కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, మహేశ్, రెడ్డి సంఘం అధ్యక్షుడు అభిలాష్ రెడ్డి, సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, జూన్ 13: కొత్తగా పాసుబుక్ పొందిన రైతులు ఈ నెల 20లోగా రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. శుక్రవారం దుర్శేడ్ రైతు వేదికలో ఏఈవో పైడితల్లి కొత్తగా పాస్ పుస్తకం పొందిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వివరాలు ఆన్‌లైన్ చేశారు.

## తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

హుజూరాబాద్ రూరల్, జూన్ 13: పుట్టిన బిడ్డకు ముర్రపాలు పట్టించాలని, తల్లిపాలతోనే ఆరోగ్యంగా ఉంటారని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్ పర్సన్ ధనలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో సగుణ తెలిపారు. బోర్నపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం సభకు వారు హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

శంకరపట్నం, జూన్ 13: మొలంగూర్ గ్రామంలో రెండు బైకులు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ గ్రామానికి చెందిన లింగారెడ్డి (59) అనే వ్యక్తి కరెంట్ మోటర్ రిపేర్ కోసం కేశవపట్నానికి బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మొలంగూర్ ఎస్సీ కాలనీ వద్దకు రాగానే కాలనీ లోపలి వైపు నుంచి ఓ యువకుడు వేగంగా వచ్చి లింగారెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లింగారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఇటీవల సెలవుపై ఇంటికి వచ్చిన లింగారెడ్డి కొడుకు ఆర్మీ ఉద్యోగి విద్యాసాగర్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగారెడ్డి మృతి చెందాడు. విద్యాసాగర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన మొలంగూర్ గ్రామానికి చెందిన కనకం తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. రవి తెలిపారు.

## మాబ్ ఆపరేషన్ డ్రిల్‌పై పోలీసులకు శిక్షణ



మాబ్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 13: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీం (క్యూఆర్టీ) పోలీసు సిబ్బందికి 'మాబ్ ఆపరేషన్ డ్రిల్'పై శుక్రవారం సమగ్ర శిక్షణ ఇచ్చారు. కరీంనగర్ బైపాస్ రోడ్డులోని కమిషనరేట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా లాఠీ డ్రిల్, గ్యాస్ గన్ పేల్చే విధానం, ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు అల్లరి మూకలను సమర్థవంతంగా చెదరగొట్టడానికి పోలీసులు నిర్వర్తించాల్సిన విధులను అభ్యాసం చేయడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, జానీమియా, కుమారస్వామి, శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిపారుదల కాలువల తనిఖీ

కలెక్టరేట్, జూన్ 13 : జల్‌జీవన్ మిషన్ పథక పర్యవేక్షణలో భాగంగా కేంద్ర నీటి కమిషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని వరద కాలువ, మధ్య మానేరు కాలువతో పాటు పలు ఉపకాల్వలను కేంద్ర అధికారుల బృందం తనిఖీ చేసింది. అనంతరం కలెక్టరేట్ సమావేశమందిరంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కేంద్రం మంజూరు చేసిన నిధులతో పూర్తి చేసిన పలు పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర బృంద సభ్యులు మాట్లాడుతూ, నీటి పారుదల ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులకు సంబంధించిన నివేదికను కేంద్రానికి అందజేస్తామని వెల్లడించారు. సమావేశంలో సెంట్రల్ వాటర్ కమిషన్ సంయుక్త కార్యదర్శి సింతల్‌రాజన్‌చొక్కలింగం, కలెక్టర్ పమేలా సత్పతి, కేంద్ర బృందం సభ్యులు సుధీర్‌కుమార్, ఈఈ ధీరజ్ సింఘాల్, సూపరింటెండెంట్ ఇంజినీర్ సుమతిదేవి, ఈఈ జగన్, ఎస్ఈ పెద్ది రమేశ్‌తో పాటు ఏఈలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

చిగురుమామిడి, జూన్ 13: మండలంలోని రేకొండ మాజీ ఎంపీటీసీ చాడ శోభ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుమారులు సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి, చాడ మురళీధర్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. చాడ శోభ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరమల్ల శేఖర్, నాయకులు దుడ్డెల లక్ష్మీనారాయణ, నల్లా రాజేందర్ రెడ్డి, తదితరులున్నారు. అలాగే చాడ శోభ కుటుంబాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డితో కలిసి పరామర్శించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 13: ఏబీ స్విచ్, సబ్ స్టేషన్ మెయింటనెన్స్, మిడిల్ పోల్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి11గంటల వరకు రాజీవ్‌చౌక్, రూరల్ పోలీస్ స్టేషన్, భారత్ టాకీస్ ఏరియా, టవర్ సర్కిల్, బ్రాహ్మణ వీధి, అహ్మద్ పుర, ద్వారక నగర్, వాల్మీకీ నగర్, ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు బద్దిపల్లి, నాగుల మల్యాల, కమాన్ పూర్, గ్రానైట్ ఇండస్ట్రీస్, సాయంత్రం 3 నుంచి 4.30 గంటల వరకు నగునూరు, వల్లంపహాడ్, తీగల గుట్టపల్లె, ఉదయం 8నుంచి11గంటల వరకు సీఎంఆర్ రోడ్డు ఏరియా, డీపీవో జంక్షన్, జైల్ పెట్రోల్ బంక్, సవరాన్ స్ట్రీట్, రాజా థియేటర్, ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు సప్తగిరి కాలనీ స్కూల్ ఏరియా మాచర్ల గార్డెన్ సమీపంలో, బృందావనం అపార్ట్‌మెంట్, రిజ్వాన్ అపార్ట్ మెంట్, అంజుమ్ కాంప్లెక్స్, అయోధ్య కాలనీ, వెంకటేశ్వర కాలనీ, కట్టరాంపూర్, వాసుదేవ కాలనీ, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12గంటల వరకు శ్రీపురం కాలనీ, రజ్వీ చమాన్, సిటిజన్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, విజయ నగర్ కాలనీ, కృష్ణ నగర్, ఆటో నగర్, బొమ్మకల్, చల్మెడ హాస్పిటల్, గుంటూరు పల్లె, దుర్శేడు, గోపాల్ పూర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.